క్లుప్తంగా

విద్యా కానుక పంపిణీకి చర్యలు



విద్యా కానుక మెటీరియల్స్ పరిశీలిస్తున్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి

ఏలేశ్వరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యార్థులకు అందించే విద్యా కానుక పంపిణీకి చర్యలు చేపట్టినట్టు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యాకానుక పథకంలో భాగంగా విద్యార్థులకు అందించే మెటీరియల్స్ ఎంపీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం మెటీరియల్స్ సిద్ధం చేసిందన్నారు. పుస్తకాలు, దుస్తులు, బ్యాగ్‌లు, షూలు తదితర నాణ్యమైన మెటీరియల్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్బాయి, సిబ్బంది పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ఏలేశ్వరంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న రిటైర్డ్ అధ్యాపకుడు సత్యగాంధీ

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డ్ అధ్యాపకులు చెన్నాప్రగడ సత్యగాంధీ అన్నారు. పట్టణంలోని లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన విద్యార్థులకు స్టోరీ రీడింగ్, స్టోరీ రైటింగ్‌పై మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లీషు, మ్యాథ్స్, యోగ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు.

కాంగ్రెస్ అనుచిత వ్యాఖ్యలపై నిరసన ర్యాలీ

ఏలేశ్వరం: కర్ణాటక ఎన్నికల్లో విజయం సాధిస్తే భజరంగ్‌దళ్‌ను నిషేధిస్తామని కాంగ్రెస్ పార్టీ చేసిన అనుచిత వ్యాఖ్యలపై పట్టణంలో మంగళవారం నిరసన ర్యాలీ చేశారు. బీజేపీ, విశ్వహిందూ పరిషత్, అనుబంధ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేశారు. వారు మాట్లాడుతూ భజరంగదళ్ నిషేధిస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించడం దారుణమన్నారు. హిందువుల అణిచివేతకు పూనుకున్న కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెబుతామన్నారు. కాంగ్రెస్ పార్టీ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవన్నారు. హిందువుల మనోభావాలను కించపరిచేలా కాంగ్రెస్ పార్టీ వ్యవహరించడం దారుణమన్నారు. తొలుత వీహెచ్‌పీ పిలుపు మేరకు ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పఠించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల కార్యదర్శి కటకం కిరణ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు గట్టెం వెంకటరమణ, పాబోలు దేవి, మల్లేశ్వరీ, ఇందిరా, కామాక్షి, రెడ్డి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు భోజనం అందజేత

ఏలేశ్వరం: వివేకానంద సేవా సమితి ట్రస్టు ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం గర్భిణులకు భోజనం అందించారు. ట్రస్టు అధ్యక్షుడు మైరాల నాగేశ్వరరావు, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో గర్భిణులకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీశెట్టి మంగ, వేగి వీర ప్రభాకర్, నక్కా శివ, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడా శిక్షణా శిబిరం ప్రారంభం

కిర్లంపూడి: కొక్కొండ రామశేషగిరిరావు పంతులు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం క్రీడాకారులకు శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కోచ్‌లు కాళ్ల పాలారావు, పీఈటీ యూఎస్‌వీ సత్యవతి మాట్లాడుతూ ఈ శిబిరంలో కబడ్డీ, ఖోఖో క్రీడలకు తర్ఫీదు ఇస్తున్నారు. సెలవు రోజుల్లో ఈ క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైతులను ఆదుకోవాలి

కిర్లంపూడి: తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలంటూ స్థానిక తహసీల్దార్ కేవీ మాధవరావుకు టీడీపీ మండల అధ్యక్షుడు చదరం చంటిబాబు ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తడిసి, రంగుమారిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతును ఆదుకోవాలన్నారు.

ప్రత్తిపాడు: నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ మంగళవారం టీడీపీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు.

గోకవరం: అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం గోకవరంలో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ శ్రీనివాస్‌కి వినతి పత్రం అందించారు.

బిక్కు బిక్కుమంటూ..

- హడలెత్తిస్తున్న అడవి జంతువుల సంచారం
- పశువులపై దాడి, రైతుల ఆందోళన



ఉప్పలపాడు తిరపతి చెరువులో అడవి జంతువుల పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

గండేపల్లి: అడవి జంతువుల సంచారంతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. సమీపంలో ఉన్న అడవి నుంచి వచ్చిన జంతువులు పగలూ రాత్రి అని తేడా లేకుండా పశువులపై దాడి చేస్తున్నాయి. దీంతో రైతులు పశువులను కాపాడుకునే పనిలో నిమగ్నమయ్యారు. అడవి జంతువులు ఏ క్షణం ఏ పక్క నుంచి వచ్చి దాడికి పాల్పడతాయోనని భయభ్రాంతులకు గురవుతున్నారు. అంతేకాకుండా రైతులు పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు.

మల్లేపల్లి శివారు పొలంలోని మకాంలో కట్టేసి ఉంచిన లేగదూడలపై, గేదెపై దాడి జరగడంతో రైతులు తమ పశువులను ఇళ్ల వద్దకు తోలుకుపోతున్నారు. రాత్రి, పగలు అను తేడాలేకుండా అడవి జంతువులు సంచరించడంతో కూలీలు, రైతులు పొలాలలోకి వెళ్లాలంటేనే భయపడుతున్నారు. వ్యవసాయాధారిత రైతు కుటుంబాలు కావడంతో పొలాలలో మకాల వద్ద తమ పశువులను ఉంచుతారు. ఈ నేపథ్యంలో ఉదయం, సాయంత్రం పాల కోసం తప్పనిసరిగా పొలంలోకి వెళ్లాల్సిన పరిస్థితి. వీటి రాకతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లబుచ్చుతున్నారు.

జరిగింది ఇదీ..

మండలంలోని మల్లేపల్లి శివారులో శుక్రవారం రాత్రి సోమవారం ఉప్పలపాడు శివారులో పట్టపగలు అడవి జంతువులు పశువులపై దాడి చేశాయి. శుక్రవారం రాత్రి జరిగిన దాడిలో లేగదూడ మృతి చెందగా, సోమవారం పట్టపగలే మరో లేగదూడ పొట్టపై చర్మన్ని కొరికి మాంసాన్ని తినడంతో లేగదూడ ప్రాణాపాయస్థితి నుంచి కోలుకుంటుంది. రెండు చోట్ల జరిగిన సంఘటనల్లో లేగదూడలు, గేదెలు వెరసి నాలుగు వాటిపై అడవి జంతువులు దాడి చేయడంతో వాటికి వైద్యం అందజేస్తున్నారు.

అధికారులకు చెమటలు

అడవి జంతువులు అటవిశాఖ, వన్యప్రాణి సంరక్షణా సిబ్బందికి చెమటలు పట్టిస్తున్నాయి. పశువులపై దాడి చేస్తున్న వాటిని కనిపెట్టేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి వరకూ జరిగిన సంఘటన ప్రాంతాల్లో వాటి పాదముద్రలు సేకరించి వాటి ఆధారంగా కుక్క జాతికి చెందిన అడవి జంతువులు అయి ఉండవచ్చని అధికారులు ఒక అంచనాకి వచ్చారు.



అడవి జంతువుల పాదముద్రలు (ఫైల్)

రైతులకు కనిపించిన రేసు కుక్కలు

మల్లేపల్లి శివారులో శుక్రవారం రాత్రి సోమవారం ఉప్పలపాడు శివారులో పట్టపగలు దాడిచేశాయి. ముందుగా జరిగిన సంఘటన ప్రదేశంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు చిక్కని జంతువులు రెండు రోజుల వ్యవధిలో మరో ప్రాంతంలో దాడికి తెగబడ్డాయి. మంగళవారం ఉదయం సుబ్బాయమ్మపేటలో గొల్లవిల్లి అప్పలరాజుకు చెందిన పామాయిల్ తోట నుంచి వెళుతున్న రెండు రేసు కుక్కలు కనిపించాయని కొంత దూరం వెంబడించడంతో పారిపోయాయన్నారు. ఈ రెండు సంఘటనలు సుమారు రెండు కిలోమీటర్ల వ్యవధిలో జరగడంతో పక్కనే ఉన్న అటవీ ప్రాంతం నుంచి వచ్చాయని స్థానికులు అనుకుంటున్నారు. అయితే చుట్టు పక్కల ఉంటాయని, జాగ్రత్తగా ఉండాలని అధికారులు చెబుతున్నారు. పెద్ద జంతువులతో పాటు పిల్లలు ఉన్నట్టు వాటి పాదముద్రలను బట్టి చెబుతున్నారు.

గ్రామానికి అవసరమైన పనులను గుర్తించాలి

గోకవరం: ఉపాధి హామీ పథకంలో గ్రామానికి అవసరమైన పనులను గుర్తించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఉపాధి గ్రామసభ జరిగింది. ఈ సమావేశంలో ఉపాధి సిబ్బంది పాల్గొని మాట్లాడుతూ ఉపాధి కూలీలు గుర్తింపు కార్డులు కోల్పోతే వారిని రెగ్యులర్ చేస్తామన్నారు. ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నరాలశెట్టి నర్సయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పులపర్తి బుజ్జి, కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వాస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన

గోకవరం: కొత్తపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించే ప్రభుత్వాస్పత్రికి బుధవారం జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు శంకుస్థాపన చేయనున్నట్టు జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు తెలిపారు. ఉదయం నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం తాత్కాలిక భవనాన్ని ప్రారంభిస్తారన్నారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొవాలన్నారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

- జగనన్నకు చెబుదాం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి
- ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు తదితరులు

జగ్గంపేట: జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్నకు చెబుదాం ప్రారంభించి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లైవ్ కార్యాక్రమాన్ని టీవీలో ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు, అవసరాలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం మొదలుపెట్టారన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా తెలియజేసేందుకు 1902 టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంటుందని, తద్వారా ముఖ్యమంత్రి కార్యాలయం ద్వారా సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటారని సమస్య పరిష్కార మార్గం ఏ స్థాయిలో ఉందో మన ఫోన్‌లోనే చూసుకోవచ్చునన్నారు. ఇప్పటికే స్పందన కార్యాక్రమం ద్వారా సమస్యలు పరిష్కరిస్తున్నారని ఈ కార్యక్రమం ద్వారా ప్రతి సమస్య ప్రభుత్వ శాఖల ద్వారా తీరనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఒమ్మి రఘురాం, ఎంపీపీ అత్తులూరి నాగబాబు, ఉప సర్పంచ్ బండారు రాజా, గండేపల్లి వైస్‌ఎంపీపీ కుంచే రాజా, కిర్లంపూడి ఎంపీపీ తోర రవి, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఎంపీడీఓ సూర్యనారాయణతో కలిసి ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా సీఎం జగన్ పరిపాలన అందిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు జవాబుదారీగా ఉంటూ సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలపై తక్షణమే పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభించారన్నారు.



కోటనందూరులో సీఎం జగన్ ప్రసంగాన్ని తిలకిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు, ఎంపీడీఓ శర్మ

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీపీ లగుడు శ్రీనివాసు, ఇతర అధికారులతో కలిసి ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తిలకించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



ప్రమాదస్థలం వద్ద సహాయక చర్యల్లో ఎస్సై విద్యాసాగర్

జగ్గంపేట: స్థానిక గోకవరం రోడ్డులో మంగళవారం జరిగిగన రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు సీతారాంపురం గ్రామానికి చెందిన రాయి వీరబాబు స్కూటీపై జగ్గంపేట నుంచి స్వగ్రామం వెళుతుండగా శివపార్వతి ఫంక్షన్ హాల్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరబాబు కుడి కాలుకు తీవ్ర గాయమైంది. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ సహాయక చర్యలు చేపట్టి, స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు ఆయన తెలిపారు.

వాహనం ఢీకొని.. వ్యక్తికి గాయాలు

కిర్లంపూడి: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తికి గాయాలయ్యాయి. దీనిపై కేసు నమోదు చేసినట్టు కిర్లంపూడి ఎస్సై టి.రఘునాథరావు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం .. ఆదివారం అర్ధరాత్రి పిఠాపురం మండలం విరవ గ్రామానికి చెందిన అల్లాడి వీరభద్రం, అర్జన్‌పూడి వీర సతీష్, సత్యనారాయణ మోటారుసైకిల్‌పై ముక్కొల్లులో బంధువుల పెళ్లికి వెళ్లి వస్తున్నారు. రాజుపాలెం వచ్చే సరికి సామర్లకోట వైపు నుంచి మోటారుసైకిల్‌పై వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి ఢీకొని వెళ్లిపోయాడు. ఈ ప్రమాదంలో వీరభద్రం కాలు విరిగిపోవడంతో కాకినాడ జీజీహెచ్ చికిత్స పొందుతున్నాడు. అల్లుడు బుర్రె రఘుబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కనకదుర్గమ్మకు జన్మనక్షత్ర పూజలు



కనకదుర్గ అమ్మవారికి హోమం పూర్ణాహుతి చేస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి మెట్లదారి వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మ నక్షత్రం మూల సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, చండీ హోమం నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. అనంతరం 11 గంటలకు పూర్ణాహుతి చేశారు. నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి, ప్రసాదాలు నివేదించారు. వేదపండితులు సంతోష్, ఆలయ అర్చకులు ప్రయాగ రాంబాబు, వడలి నర్సింహమూర్తి, వ్రతపురోహితులు కొంపెల్ల మూర్తి, కూచుమంచి ప్రసాద్ తదితరులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఐదు జంటలు రూ.750 టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

తేనెపట్టు తొలగింపు



తేనెపట్టు తొలగించిన దృశ్యం

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: వేలాది మంది ప్రయాణికులు, భక్తులు ప్రతినిత్యం ప్రయాణించే అన్నవరం రైల్వేస్టేషన్ రెండో ప్లాట్‌ఫాం లిఫ్ట్ వద్ద ఉన్న తేనెపట్టును రైల్వే సిబ్బంది మంగళవారం తొలగించారు. స్టేషన్‌లో తేనెపట్టు ఉండడంతో భక్తులు ఆందోళన చెందుతున్న విషయాన్ని ఆదివారం 'సాక్షి' దినపత్రికలో 'అన్నవరం రైల్వేస్టేషన్‌లో తేనెపట్టు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై రైల్వే అధికారులు స్పందించి, సామర్లకోట నుంచి సంబంధిత సిబ్బందిని తీసుకువచ్చి తేనెపట్టును తీయించారు.

వృద్ధులకు పండ్లు, రొట్టెల పంపిణీ



వృద్ధులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న రెడ్ క్రాస్ ప్రతినిధులు

తుని: ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా వృద్ధులకు పండ్లు,రొట్టెలు పంపిణీ చేసినట్టు తుని శాఖ కార్యదర్శి డాక్టర్ నేరెళ్ల సత్యనారాయణ తెలిపారు. మంగళవారం పెంటకోట రోడ్డులోని వృద్ధాశ్రమానికి రెడ్‌క్రాస్ ప్రతినిధులు వెళ్లి జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు, వైద్య సేవలను అందించారు. భోజన సదుపాయం కల్పించారు. రెడ్ క్రాస్ ప్రతినిధులు ఆకెళ్ల శాస్త్రి, కరెళ్ల గణపతిరావు, కోటిబాబు, గొల్లపూడి ప్రసాద్, కడిమిశెట్టి సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

15 లీటర్ల సారాతో ఇద్దరి అరెస్టు



నిందితుడు, స్వాధీనం చేసుకున్న సారా, బైక్‌తో ఎస్‌ఈబీ సిబ్బంది

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో(ఎస్‌ఈబీ) పరిధిలో అక్రమంగా తరలిస్తున్న 15 లీటర్ల సారాతో ఇద్దరు నిందితులను స్థానిక ఎస్‌ఈబీ పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి.అశోక్ కథనం ప్రకారం.. ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెం గ్రామంలో గస్తీ నిర్వహిస్తుండగా బైక్‌పై సారా తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన నల్లం గంగాధర్‌ను అరెస్టు చేసి, అతని నుంచి బైక్‌తో పాటు పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కంబాలపాలెంలో సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. ప్రత్తిపాడు మండలం గజ్జనపూడిలో ఐదు లీటర్ల సారాతో జి.అప్పలరాజును అరెస్టు చేశారు. వీటిపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు స్థానిక ఎస్‌ఈబీ సీఐ పి అశోక్ తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స

- ఎడమ కాలు తొడ నుంచి 2 కిలోల కణితి తొలగింపు



తుని ప్రభుత్వ ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేసిన వైద్యులు

తుని: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స చేశారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ స్వప్న మంగళవారం తెలిపారు. తొండంగి మండలం కొత్తపేటకు చెందిన కోడా మాసేను ఎడమ తొడపై కణితితో బాధపడుతూ తుని ఆసుపత్రిలో ఇటీవల చేరారు. వైద్యులు పరీక్షలు నిర్వహించి కణితి ఉన్నట్టు గుర్తించారు. సర్జన్లు సాయికిరణ్, నరేష్, అనస్తీషియన్ శ్రావణి కలిసి రెండు గంటల పాటు శస్త్ర చికిత్స చేసి 2 కిలోల కణితను తొలగించారు. ప్రస్తుతం మాసేను ఆరోగ్యంగా ఉన్నాడు. అరుదైన శస్త్ర చికిత్స చేసిన వైద్య బృందం, నర్సులను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు పోతుల లక్ష్మణ్, చిక్కాల సీతారాం అభినందించారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

- మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుధారాణి



తుని వైఎస్సార్ కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న సీపీ సుధారాణి

తుని: పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని తుని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. మంగళవారం 22వ వార్డులో కౌన్సిలర్ కోలా శ్రీను ఆధ్వర్యంలో మన మున్సిపాలిటీ-మన బాధ్యత కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గం అధ్యక్షుడు ఏలూరి బాలు ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో 1100 మందికి ఇళ్లస్థలాలు ఇచ్చారని, ఇప్పుడు మోగా టౌన్ షిప్‌గా రూపుదిద్దుకుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ కాలనీ అభివృద్ధికి శ్రద్ధ చూపలేదన్నారు. ప్రస్తుత పాలకవర్గం వచ్చాక రూ.3.50 కోట్లతో రోడ్లు నిర్మించామన్నారు. భవిష్యత్‌లో కాలువలు, మంచి నీటి సదుపాయం కల్పిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ పామర్తి మహేష్, గాంధీ సత్రం ఛైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జెడ్‌ఆర్‌యుసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ట్యాంక్‌ను శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ కొల్లు సత్తిబాబు అన్నారు. కత్తిపూడి గ్రామంలో మంగళవారం పంచాయతీ సిబ్బంది రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెత్తను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీయించారు. గ్రామం నలుమూలల బ్లీచింగ్, డ్రైన్లలో దోమల మందు పిచికారీ చేశారు. వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సత్తిబాబు మాట్లాడుతూ గ్రామం పరిశుభ్రతే లక్ష్యంగా అధికారులు పని చేయాలని సూచించారు.

చురుగ్గా ధాన్యం కొనుగోళ్లు



రావికంపాడులో కళ్లాల్లో ధాన్యాన్ని పరిశీలించిన ఏఓ నరసింహం

తొండంగి: గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చురుగ్గా సాగుతున్నాయని అధికారులు తెలిపారు. మండల వ్యవసాయశాఖ అధికారి ఎస్.నరసింహం, గ్రామ సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, టెక్నికల్ సిబ్బంది కలిసి ఎ.కొత్తపల్లి, సీతారాంపురం, కొమ్మనాపల్లి, ఎ.వి.నగరం, రావికంపాడు, పి.ఇ.చిన్నాయపాలెం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కళ్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని, కొనుగోలు చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. రైతులు ఎటువంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. నిబంధనలు సడలించిందని వివరించారు. దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వమే గిట్టుబాటు ధర కల్పిస్తుందన్నారు. ఇప్పటి వరకూ 23 మంది రైతుల నుంచి 1242 క్వింటాల్ కొనుగోలు చే సామన్నారు. ఆయన వెంట ఏఈవా కొప్పన దైవప్రసాద్, ఇతర సిబ్బంది ఉన్నారు.

విద్యార్థినులకు కలెక్టర్ అభినందన



అనంతలక్ష్మిని అభినందించిన కలెక్టర్ కృతికా శుక్లా

తొండంగి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థినులను కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం అభినందించారని ఎంఈవో షేక్‌బాబ్జి తెలిపారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో పది పరీక్షలో 578 మార్కులు సాధించి అద్దరిపేట జెడ్పీ హైస్కూలు విద్యార్థిని చవాకుల కల్యాణి, 576 మార్కులు సాధించిన ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూలు విద్యార్థిని మాధన పూర్ణ సత్య అనంతలక్ష్మి, హెచ్‌ఎంలను, ఇతర ఉపాధ్యాయులను అభినందించారన్నారు. ఎ.కొత్తపల్లిలో విద్యార్థిని అనంతరలక్ష్మిని పాఠశాల స్కూల్ కమిటీ ఛైర్మన్ గర్లంక బాబ్జి, సర్పంచ్ బెక్కం రాజా వరలక్ష్మి, ఎంపీటీసీలు నందెపు చిన్న, ఎలుగుబంటి రామకృష్ణ తదితరులు అభినందించారు.

తాటాకిల్లు దగ్ధం



కాలిపోతున్న తాటాకిల్లు

కోటనందూరు: స్థానిక సీబీఎం చర్చి ప్రాంతంలో మంగళవారం తాటాకిల్లు దగ్ధమైంది. స్థానిక నందిక విజయరాజుకు చెందిన తాటాకింట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఇంటిమొత్తం వ్యాపించాయి. సమాచారం అందుకున్న తుని అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. అయితే అప్పటికే ఇల్లు మొత్తం కాలి బూడిదైంది. ఈ అగ్ని ప్రమాదంలో ఇంట్లో వస్తువులతో పాటు కొంత నగదు కాలిపోయినట్టు బాధితులు తెలిపారు. రూ.లక్ష వరకూ ఆస్తినష్టం జరిగినట్టు అధికారులు అంచనా వేశారు. గ్రామ సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అన్నసమారాధన

జగ్గంపేట: జె.కొత్తూరు గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి జాతరను పురస్కరించుకుని మంగళవారం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి పూజలు చేశబూరు. అన్నదానంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి నీటి సరఫరాకు అంతరాయం

తుని: పట్టణ పరిధిలోని 10 వార్డులకు పరిమితంగా నీటి సరఫరా జరుగుతుందని కమిషనర్ ప్రసాదరాజు మంగళవారం తెలిపారు. తుని మండలం రేఖవానిపాలెం పంపుహౌస్‌లో వంద్రుమట్టి తొలగింపు పనులు చేపట్టామన్నారు. బుధవారం నుంచి ఈ నెల 14 వరకూ కత్రాళ్లకొండ పంపుహౌస్ నుంచి నీటి సరఫరా జరుగుతుందని, 10 వార్డులకు చెందిన ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన కోరారు.

మానవ హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



శస్త్ర చికిత్సకు ఎంపికైన పది మందితో బీహెచ్‌ఆర్‌సీ బృందం

పెద్దాపురం: భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ సేవలను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ అధ్యక్షులు ఆర్.విజయ్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఆశీర్వాదం అన్నారు. మండలంలోని కాండ్రకోట మహిమ గల దేవుని మందిరం బాపిస్టు చర్చిలో మంగళవారం మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. బీహెచ్‌ఆర్‌సీ, సీఎంసీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో డాక్టర్ అమృత్‌లాల్ వైద్య సేవలందించారు. సుమారు వంద మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా పది మందికి శస్త్ర చికిత్స నిమిత్తం తరలించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎ.వెంకట్రావు, ఆర్.జయరాజ్, సుందర్‌కుమార్, సీహెచ్.వర్మ, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.